

టీడీపీ బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లతో పాటు అధిక స్థానాలు కల్పిస్తాం. కూటమి అభివృద్ధి, సుపరిపాలనతో ఎన్నికల్లో ఘన విజయం సాధించి చంద్రబాబు, లోకేష్‌కు విజయాన్ని అంకితం చేస్తాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 06.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 166 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఇంటింటికీ జలధార

## రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార'కు శ్రీకారం





- 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు
- రాయలసీమ అభివృద్ధి ఆగదు
- ప్రపంచ మార్కెట్లకు 'సీమ బ్రాండ్' ఫలాలు
- రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్
- పొద్దుటూరు సభలో సీఎం చంద్రబాబు

**ప్రొద్దుటూరు, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార పనుల్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. కడప జిల్లా పొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లిలో పైలాన్ ఆవిష్కరించిన నేతలు ప్రతి ఇంటికీ కుళాయి, ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేలా చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ. 30,156 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు 24,601 ఆవాసాలకు నీటి సరఫరాను విస్తరించనున్నారు. ఇందుకోసం 77,243 కిలోమీటర్ల పైపు లైన్ నెట్వర్క్‌ను విస్తరించేలా పనులు చేపట్టనున్నారు. మిగతా 2లో...





# డ్వాక్రా నుంచి.. బిజినెస్ బాస్‌లుగా

- 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం
- సాధికారిత చాటేలా 'నేషనల్ సరస్ మేళా' నిర్వహణ
- 'స్వయం ఏపీ'తో గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్
- సెర్ప్, మెప్మాపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనికి సెర్ప్, మెప్మా అధికారులు మద్దతుగా నిలవాలని సూచించారు. అవసరమైతే కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని నిర్దేశించారు. సంపద సృష్టికి ఎక్కడ, ఎలాంటి అవకాశాలు ఉన్నా వినియోగించుకునేలా డ్వాక్రా మహిళల్ని తీర్చిదిద్దాలన్నారు. 5 లక్షల మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేయడం లక్ష్యం కావాలని, స్వయం ఉపాధి పొందాలనుకునే వారు ఫ్రాంచైజీలు ప్రారంభించినా ప్రోత్సహించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కోటికి పైగా ఉన్న స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడితే... మిగతా 2లో...

# రాజకీయం కాదు.. ప్రజలే ముఖ్యం

- తాగునీటి విషయంలో రాజకీయాలకు తావులేదు
- ప్రాంతం, పార్టీ తేడా లేకుండా ప్రతి గ్రామానికీ అభివృద్ధి
- పులివెందుల నుంచి అరకు, పాడేరు వరకు సమాన ప్రాధాన్యం
- ప్రతి ఇంటికీ సురక్షిత నీరే ప్రభుత్వ లక్ష్యం: పవన్ కల్యాణ్



**ప్రొద్దుటూరు, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్):** తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధి విషయంలో ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ విధానమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే 'అమరజీవి జలధార' లక్ష్యమని తెలిపారు. సోమవారం కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి రూ. 30,156 కోట్ల విలువైన తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శ్రీరామచంద్రుని పాదస్పర్శతో పునీతమైన నేల. మహాత్మా గాంధీ నడయాడిన నేల. మిగతా 3లో...

# తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం



- రైతుకు సాంకేతికతను చేరువ చేస్తాం
- ఏఐ, యాంత్రీకరణతో సాగులో కొత్త మార్పులు
- 'రైతు కోసం' యాప్, 'రైతు మిత్ర సలహావాణి' ప్రారంభం
- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

**బాపట్ల, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, పంటలకు విలువ జోడింపును సమన్వయం చేసి రైతులకు సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాధారణ రైతులు, చదువుకోని రైతులు సైతం సులభంగా సలహాలు, సహాయ సహకారాలు పొందగలిగేలా సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాపట్లలో నూతనంగా ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ పోస్ట్–హార్వెస్ట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రధాన భవనాన్ని, వ్యవసాయ యంత్ర పరికరాల వర్క్‌షాప్, శిక్షణ కేంద్రాన్ని సోమవారం మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీఫెట్ ప్రధాన భవనం, వర్క్‌షాప్, శిక్షణ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌ను, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫార్మ్ మెషినరీ అండ్ ఇంప్లిమెంట్స్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో మిగతా 3లో...

# ప్రభుత్వ బడులకు 4-స్టార్ హంగులు

- 2029 నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు
- ఏడాదిలోగా వన్‌స్టార్ బడులన్నీ టూస్టార్‌కు
- ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల బడులపై ప్రత్యేక దృష్టి
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లు
- 7 వేల హైస్కూళ్లలో కంప్యూటర్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు
- మంత్రి లోకేశ్ సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్–స్టార్ పాఠశాలలన్నీ టూ–స్టార్‌కు అప్‌గ్రేడ్ చేయాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో సోమవారం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

# కూటమితోనే రాయలసీమ అభివృద్ధి

- జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత



**ప్రొద్దుటూరు/కడప (జర్నలిస్ట్ ఫైల్) :** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు రాయలసీమ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికంగానే లభించనున్నాయన్నారు. ప్రొద్దుటూరులో రూ. 30,156 కోట్లతో అమరజీవి జలధార ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ, ఒకప్పుడు రాళ్లు తేలిన రాయసీమలో కూటమి పాలనలో నేడు రైజింగ్ సీమగా ఆవిర్భవిస్తోందన్నారు. రాయలసీమ జిల్లాలను పారిశ్రామిక, ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. మిగతా 2లో...

# ఇళ్ల నిర్మాణంలో ఏపీ నంబర్ వన్

- పీఎంఏవై-అర్బన్ 2.0లో జాతీయ ప్రథమ స్థానం
- 68,309 ఇళ్లు మంజూరు.. 50,122 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం
- 2029 నాటికి అర్హులైన పేదలందరికీ సొంతింటి కల
- వేగవంతమైన అమలుకు జాతీయ అవార్డు

2 లో



# స్విస్ పెట్టుబడులకు ఏపీ రెడ్‌కార్పెట్

- స్విస్ కంపెనీలకు ఏపీలో పెట్టుబడి అవకాశాలపై మంత్రి టీజీ భరత్ చర్చలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌తో ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ న్యూఢిల్లీలో కీలక చర్చలు జరిపారు. మిగతా 2లో...

## కూటమితోనే రాయలసీమ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలే రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాయలసీమలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు స్థానికంగానే పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశకాలు లభిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ సహా పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామన్నారు. పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో మారు మూలగ్రామాల్లోనూ సైతం రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పుడు రూ. 30 వేల కోట్లతో అమరజీవి జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ ప్రాజెక్టుతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారించడమే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల పరిశుద్ధమైన నీటిని అందించడమే లక్ష్యంగా అమరజీవి జలధార కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి సవిత తెలిపారు.

## స్విస్ పెట్టుబడులకు ఏపీ రెడ్‌కార్పెట్




(మొదటి పేజీ తరువాయి)

స్విస్ కాన్ఫెడరేషన్ స్టేట్ సెక్రటరీ ఫర్ ఎకనామిక్ అఫైర్స్ హెలెనా బుడ్లిగర్ ఆర్టియడాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.

స్విస్ రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఏపీ–స్విట్జర్లాండ్ బిజినెస్ ఫోరమ్‌లో స్విస్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలోని పెట్టుబడి అవకాశాలను మంత్రి వివరించారు. అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఫార్మా, బయోటెక్, మెడ్‌టెక్, క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందన్నారు. ఏపీఈడీబీ ద్వారా సింగిల్ డెస్క్ విధానంలో పెట్టుబడిదారులకు సహకారం అందిస్తున్నామని తెలిపారు.

భారత్–ఈఎఫ్‌టీఏ వాణిజ్య ఒప్పందం (టీఈపీఏ) ద్వారా రానున్న 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించగలదని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జూరిచ్, దావోస్ పర్యటనలతో స్విట్జర్లాండ్‌తో సంబంధాలు మరింత బలోపేతమయ్యాయని తెలిపారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు స్విస్ పారిశ్రామిక వర్గాలను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు బాలరాజు నాయక్‌కి ఘన సత్కారం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల పట్టణానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వారు 2026 సంవత్సరానికి గాను ఆచార్యదేవోభవ పురస్కారం ను బ్రహ్మంగారిమఠం చెందిన మూడే బాలరాజు నాయక్ ను ఆ సంస్థ వ్యవస్థాపకులు పాపి జన్ని రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ సలహాదారుడు విశ్రాంతి డీఎంహెచ్వో డాక్టర్ మార్కా రెడ్డి రాజోలి శ్రీధర్ రెడ్డి వీరస్వామి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ సంస్థ వారు మాట్లాడుతూ మా సంస్థ తరఫున ప్రతి ఏటా సమాజంలో భావి భారత పౌరులను తీర్చిదిద్దుతూ ప్రభుత్వ పాఠశాలలో నిస్వార్థంగా విద్యా సేవలందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం జరుగుతుందని అందులో భాగంగా ఏడాది కలసపాడు మండలంలో పనిచేస్తున్న బాలరాజు నాయకులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని సత్కరించడం జరిగిందని తెలిపారు సన్మాన గ్రహీత బాలరాజు నాయక్ మాట్లాడుతూ వివేకానంద ఫౌండేషన్ వారు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నన్ను ఆచార్యదేవోభవ అవార్డు సత్కరించడం నా పూర్వజన్మ సుకృతం అని ఇలాంటి సన్మాన సత్కారాలు పొందిన నాకు సమాజంలో మరింత బాధ్యతతో అన్నా కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ఇలాంటి గుర్తు చేస్తాయని సమస్త వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ బి ఏఐఈఎఫ్ఓ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి వివేకానంద ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాన్ని ఆదుకున్న పీవా!



- **రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల అధ్యక్షులు జివిఎస్ రామకృష్ణ**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఆపదలో ఉన్న కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూతనిచ్చింది. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని ప్రకటకోటయ్య నగర్ లో చేనేత కుటుంబానికి చెందిన పడవల సీతారామయ్యకు పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి లోనవటంతో ఆ కుటుంబం కష్టాలను ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వి.ఎస్. రామకృష్ణ వెంటనే స్పందించి తమ తెనాలికమిటీ ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, బాపట్ల జిల్లా సెక్రెటరీ దీపాల వెంకటకోటినాగేశ్వరరావు ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. వారితోపాటు జర్నలిస్టు బోడ సుధాకర రావు పోలిశెట్టి వెంకటేశ్వరరావు,దీపాల శ్రీనివాసరావు ఉన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సమాజంలోని నిరాశ్రయులు,వృద్ధులు ,పేదలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. వృద్ధుల ముఖంలో చిరునవ్వు చూడడమే నిజమైన సేవ అని అన్నారు.

# ఇంటింటికీ జలధార





(మొదటి పేజీ తరువాయి)

తద్వారా మొత్తం 61.60 లక్షల కుళాయి కనెక్షన్లకు మరింత మెరుగైన తాగు నీటి సరఫరా జరగనుంది. మొత్తంగా ఈ పనులతో 3.3 కోట్ల మందికి సురక్షితమైన తాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 95 లక్షల కుటుంబాలకు గానూ ఇప్పటికే దాదాపు 62 లక్షల కుటుంబాలకు ఇంటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయని సీఎం తెలిపారు. జల్ జీవన్ మిషన్--2.0 కింద మరో 27 లక్షల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందడం వల్ల ముఖ్యంగా మహిళల నీటి కష్టాలు తీరతాయని చంద్రబాబు పేర్కొన్నారు. నీటి కోసం వెచ్చించే శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయని.. స్వచ్ఛమైన నీటితో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. జల్ జీవన్ మిషన్ ప్రధాన ఉద్దేశం శాశ్వత నీటి వనరుల నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేయడమేనని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో ఈ పథకం అమలులో లోపాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి భారీగా నిధులు పొందిన రాష్ట్రాలతో పోలిస్తే గత ప్రభుత్వం ఏపీలో ఈ పథకానికి కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే వినియోగిం చిందని పేర్కొన్నారు. తాగు నీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. పల్లె పండుగ–3.0 ద్వారా రూ. 11,085 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పంట కుంటలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం రానున్న కాలంలో రూ. 1.30 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

**రాష్ట్రానికి-రాయలసీమకు జల భద్రత :** తాగునీటి అవసరాలతో పాటు సాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా నీటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 24 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం ద్వారా తెలుగుతల్లికి జలహారతి ఇచ్చామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో రూ. 35 వేలకోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తేదీలతో సహా ప్రాజెక్టుల క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు కరవు సమస్య ఉండదన్నారు. కరవు పరిస్థితుల్లోనూ 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని చెప్పారు. కనీసం 200 టీఎంసీల గోదావరి వరద జలాలను వినియోగించుకుంటే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. హంద్రీ–నీవా ఫేజ్–1ను పూర్తి చేసి రాయలసీమలో రిజర్వాయర్లను నింపామని, వెలిగొండ ఫేజ్–1 ద్వారా నల్లమల సాగర్‌కు నీరు తీసుకెళ్లామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును రానున్న గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. రాయలసీమ దశ, దిశ మార్చేలా రూ. 1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ హబ్‌తో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, మార్కెటింగ్ సౌకర్యాలు పెరుగుతాయని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ, గోల్డ్ మైనింగ్ వంటి రంగాల్లో ప్రాజెక్టులు రానున్నాయని వెల్లడించారు. సినిమాల్లో ఒకప్పుడు రాయలసీమను ముఠా కక్షలకు ప్రతీకగా చూపించేవారని... ఇకపై శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు మేడ్ ఇన్ రాయలసీమ అని చెప్పుకునే రోజులు వస్తాయన్నారు. ఇక్కడ పండే ఫలాలు ప్రపంచ మార్కెట్లకు రాయలసీమ బ్రాండ్‌తో ఎగుమతి అవుతాయని సీఎం అన్నారు.

**ప్రతి కుటుంబానికి భరోసా :** పేదల సాధికారత, వ్యక్తిగత ఆదాయాల పెంపు, గ్రామాలు–పట్టణాల అభివృద్ధి, నాణ్యమైన జీవితం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు తెలిపారు. 2029 నాటికి ప్రతి కుటుంబానికి ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో 19 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పేదలకు శాశ్వత హక్కులు కల్పించేలా ఇళ్ల పట్టాలు ఇచ్చామని, విశాఖ, విజయవాడ, మంగళగిరిలో 60 వేల మందికి రూ. 52 వేల కోట్ల విలువైన ఆస్తులు అందించామని వివరించారు. ప్రతి కుటుంబానికి భరోసా.. ప్రతి వర్గానికి అండ.. ప్రతి ప్రాంతానికి అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వంటి కనీస వసతులు కూడా లేకుండా పోయాయని సీఎం అన్నారు. రోడ్ల విషయంలో నాడు–నేడు బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. పల్లెలకు రహదారుల కల్పనలో పవన్ కల్యాణ్ తనదైన ముద్ర చూపిస్తున్నారని ప్రశంసించారు. 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించామని సీఎం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ల ద్వారా రూ. 4,136 కోట్లకు పైగా నిధులు వచ్చాయని చెప్పారు. పంట కుంటలు, గ్రామాలకు రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలతో అభివృద్ధి వేగం పుంజుకుందని వివరించారు.

**దొంగ పనులే గొడ్డలి పార్టీ సిద్ధాంతం :** 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోనూ ఆ పార్టీకి చెంపదెబ్బ కొట్టారన్నారు. వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిందని, రూ. 40 కోట్ల సుపారీ అంశం బయటకు వచ్చిందని అన్నారు. మద్యం కుంభకోణంలో వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. అందులోనూ అంతిమ లబ్దిదారుగా అన్ని వేళ్లూ గొడ్డలి పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని అన్నారు. దీనికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ... వీటిపై వాస్తవాలు మాట్లాడకుండా ఫేక్ ప్రచారంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. గ్రూప్ వన్ సర్వీసు పరీక్షలు రాస్తే జవాబు పత్రాలను అ-టెండర్లు, ఎలక్ట్రీషన్లతో దిద్దించారని.. ఇసుకలోనూ దోపిడీ చేశారు. ఈ అక్రమాలు అన్నిటికీ సమాధానం చెప్పాలని సీఎం సవాలు విసిరారు. నేరాలు ఘోరాలు చేసి ప్రజల్ని మోసం చేయడానికి ఫేక్ ప్రచారం చేస్తారని ఎద్దేవా చేశారు. .గొడ్డలి పార్టీ తోక తిప్పితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓ సిద్ధాంతం అంటూలేని గొడ్డలి పార్టీ కుట్రలు , ఫేక్ ప్రచారమే అజెండా అని సీఎం ఆక్షేపించారు. నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేయటం వారి డీఎన్ఏ లోనే ఉందన్నారు. వివేకా హత్య నుంచి మద్యం కుంభకోణం వరకూ, సింగయ్యను కారుకింద తొక్కించటం నుంచి మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ కేసు తప్పించటం వరకూ అన్నీ దొంగ పనులే చేశారని ఎద్దేవా చేశారు. బలవంతపు మతమార్పిడులు, హిందువులను క్రిష్టియన్లుగా మార్చటం లాంటి చర్యలు చేస్తున్నారని.. ఇలాంటి వన్నీ ఆ పార్టీ సిద్ధాంతంలో భాగమేనని అన్నారు. రాయలసీమలో కనీసం కడపకు ఏం చేశారో చెప్పగలరా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కావాలని కోరడం సరికాదని చంద్రబాబు అన్నారు. ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదని, ప్రజలు ఇచ్చే అధికారమని గుర్తుంచుకోవాలని సూచించారు. 2019లో టీడీపీకి 23 సీట్లు వచ్చినప్పుడు ఐదు సీట్లు లాగేస్తే ప్రతిపక్ష హోదా ఉండదని ఎగతాళి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాను కూడా రాయలసీమ బిడ్డనేనని, ఈ ప్రాంతాన్ని తిరుగులేని అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళు తుందని.. రాయలసీమకు రప్పారప్పా రాజకీయాలు కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ఉంటే ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉన్నట్టేనని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రం బాగుంటేనే ప్రజలంతా బాగుంటారని చెప్పారు. అభివృద్ధి–సంక్షేమం–సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అరాచకం వద్దు.. అభివృద్ధి కావాలి. సంక్షోభం వద్దు.. సంక్షేమం కావాలి. రాయలసీమకు శాంతి, నీళ్లు, పరిశ్రమలు, సుపరిపాలన, ఉపాధే కావాలని సీఎం వ్యాఖ్యానించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# డ్వాక్రా నుంచి.. బిజినెస్ బాస్‌లుగా

(మొదటి పేజీ తరువాయి)

కోటి కుటుంబాలకు పైగా బలపడినట్టేనని సీఎం చెప్పారు. ఎంట్రప్రెన్యూర్లు ఆర్థికంగా విజయవంతం అయినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. లక్ష మంది మహిళలు ఒకొక్కరు ఏడాదికి రూ. 5 లక్షల వ్యాపారం చేయగలిగితే రూ. 5,000 కోట్ల ఆర్థిక సామర్థ్యం సాధించినట్టేని సీఎం అన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం సెర్ప్, మెప్మా అధికారులతో 5 లక్షల మంది ఎంట్రప్రెన్యూర్లను తీర్చిదిద్దడం, స్వయం ఏపీ అంశాలపై సీఎం సమీక్షించారు. దేశంలోనే స్వయం సహాయక సంఘాలు అంతటి విస్తృతమైన వ్యవస్థ మరొక్కటి లేదని సీఎం సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్ చేరుకోవాలని, అదే సమయంలో మరి కొంతమంది ఉపాధి కల్పించేలా ఎదగాలని సీఎం సూచించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న వేలాది ఉత్పత్తులకు ఒకే బ్రాండ్, నాణ్యత ప్రమాణాలు, ఆధునిక ప్యాకేజింగ్, ఈ–కామర్స్, సిగ్నేచర్ స్టోర్లు, మార్కెటింగ్ వ్యవస్థను అనుసంధానం చేస్తూ 'స్వయం ఞూ'ని తీర్చిదిద్దాలన్నారు. తొలిసారి విజయవాడలో ఈనెల 15 నుంచి 31 వరకు నిర్వహించ తలపెట్టిన 'నేషనల్ సరస్ మేళా 2026'ను విజయవంతం చేయాలని... మహిళా సాధికారత చాటేలా సరస్ మేళా నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. దీనికి దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఎంట్రప్రెన్యూర్లను, మహిళా ఎంపీలను ఆహ్వానించాలని నిర్దేశించారు. మరోవైపు సరస్ మేళాకు దేశం నలుమూలల నుంచి వివిధ స్వయం సహాయక సంఘాలు 600 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయని అధికారులు వివరించారు. మేళాకు రోజూ లక్ష మంది వస్తారని అంచనా



వేస్తున్నామన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా 15న ప్రారంభిస్తున్నారని తెలిపారు.

**అక్టోబర్ 15 నుంచి 'స్వయం ఏపీ' విక్రయాలు :** అక్టోబర్ 15 నుంచి సిగ్నేచర్ స్టోర్లు, ఫ్లిప్‌కార్ట్‌లో 'స్వయం ఞూ' ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభిస్తున్నట్టు సమీక్షలో అధికారులు వెల్లడించారు. బ్యాంక్ లింకేజీలోనూ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘ సభ్యులు ముందున్నారని తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు, మార్కెట్ అనుసంధానం, ఆర్థిక వనరులు, శిక్షణ, నాణ్యత ప్రమాణాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామం నుంచి గ్లోబల్ మార్కెట్ వరకు మహిళలకు అండగా బలమైన వ్యవస్థ నెలకొల్పడం... అవకాశాలను గుర్తించి వ్యాపారాలుగా మలిచే కార్యాచరణ చేపట్టడం... రూ. 68,585 కోట్ల రుణాలతో మహిళలకు ఆర్థిక మద్దతివ్వడం... మహిళల్లో కెపాసిటీ బిల్డింగ్, వ్యాపార నిర్వహణ కోసం ప్రముఖ సంస్థలతో శిక్షణ అందించడం... 60కి పైగా సంస్థల భాగస్వామ్యంతో సమగ్ర పారిశ్రామిక ప్రణాళిక రూపొందించడం... ఈ ఐదు ప్రధాన అంశాలతో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. ఇప్పటికే వ్యాపారంలో విజయవంతమైన మహిళలను కొత్తగా వ్యాపారంలోకి వచ్చే మహిళలకు మెంటర్లుగా అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేసేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**గ్రామీణ మహిళా వ్యాపారులకు మద్దతు :** గ్రామీణ మహిళా వ్యాపారాలను చిన్న స్థాయి జీవనోపాధి కార్యకలాపాల నుంచి సంపద సృష్టించే సంస్థలుగా మార్చేందుకు ఇంక్యుబేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఐఐఎం విశాఖపట్నం, సెంచూరియన్ యూనివర్సిటీ వంటి సంస్థలతో కలిసి మహిళా వ్యాపారాలకు మెంటార్‌షిప్, మార్కెట్, రుణం, వనరులు, వ్యాపార నైపుణ్యాల అనుసంధానం చేస్తున్నామన్నారు. మహిళల సొంత బ్యాంకింగ్ సంస్థగా ఉన్న స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ. 4,800 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు ఇప్పటికే ఆహారం, హస్తకళలు, వస్త్రాలు తదితర రంగాల్లో 23,000కు పైగా ఉత్పత్తులు తయారు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణంలో ఏపీ నంబర్ వన్



**విజయవాడ, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 అమలులో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రాల కేటగిరీలో ఏపీకి మొదటి ర్యాంకు లభించింది. ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి తోఖాన్ సాహు చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి కొర్లపాటి హెప్సిబా రాణి అవార్డును స్వీకరించారు.

పీఎంఏవై–అర్బన్ 2.0 కింద రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 68,309 ఇళ్లు మంజూరు కాగా, 50,122 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో ఇంటి యూనిట్ వ్యయాన్ని రూ. 2.50 లక్షలకు పెంచడంతోపాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తున్నాయి. ఎస్ఎన్ఏ స్పర్శ విధానం ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ, ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, సకాలంలో డీపీఆర్‌ల సమర్పణ, జిల్లా స్థాయి పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టినట్లు గృహనిర్మాణ సంస్థ తెలిపింది.

2029 నాటికి అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చాలన్న లక్ష్యానికి ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అవార్డు సాధనకు కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం, సమీక్షలతో గృహనిర్మాణ రంగంలో వేగవంతమైన పురోగతి సాధ్యమైందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడులకు 4-స్టార్ హంగులు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇన్‌ఫ్రాకు సంబంధించి ఈ విద్యా సంవత్సరంలో జీరో–స్టార్ పాఠశాల లన్నింటినీ వన్–స్టార్‌కు చేరేలా అభివృద్ధి చేయాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను 4–స్టార్‌కు చేర్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5–స్టార్‌కు చేర్చాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని సూచించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిందిగా కోరారు. పాఠశాల మౌలిక సదుపాయాల శాఖ కమిషనర్ రంజిత్ బాషా స్పందిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో వన్–స్టార్ 1,685, టూ–స్టార్



15,618, త్రీ–స్టార్‌లో 19,099, ఫోర్–స్టార్‌లో 7,172 పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని మంత్రి సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అకడమిక్‌కు సంబంధించిన సంస్కరణలు పూర్తయినందున అధికారులు, ఉపాధ్యాయులంతా ఇక పూర్తిగా అభ్యసన ఫలితాలపైనే దృష్టి సారించాలని కోరారు.

**స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి :** కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధీనంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం (ఫ్రీఖివ్) ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీం వంటి పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతీయువకులను నైపుణ్యం పోర్టల్‌లోకి తీసుకువచ్చి, ఏఐ విద్య ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలని సూచించారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, మౌలిక సదుపాయాలు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి పాల్గొన్నారు.

# ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికావు



- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల రూపకల్పన పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, అత్యంత పారదర్శకంగా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ. ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తున్న నిబంధనలు, సాంకేతిక పద్ధతులు, ఓటర్ల నమోదు ప్రక్రియపై కొందరు చేస్తున్న అవాస్తవ ఆరోపణలను ఆయన ఖండించారు. ఎన్నికల సంఘం మరియు చట్టబద్ధమైన వ్యవస్థల ద్వారా జరిగే ఈ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ తదితర నిరంతర ప్రక్రియలు పకడ్బందీగా జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదని మంత్రి పేర్కొన్నారు.

# మంత్రి లోకేష్‌ను కలిసిన ప్రఖ్యాత ఆర్చర్ జ్యోతి సురేఖ



- ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణపతకం సాధించిన సురేఖను అభినందించిన లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ, తండ్రి సురేంద్రకుమార్ సోమవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఏషియన్ గేమ్స్ లో ఇప్పటివరకు నాలుగు గోల్డ్ మెడల్స్ సహా ఆరు పతకాలు సాధించిన సురేఖ చరిత్ర సృష్టించారు. ఏషియన్ గేమ్స్ లో తన ప్రతిభతో స్వర్ణం కైవసం చేసుకున్న జ్యోతి సురేఖను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. 2028 ఒలింపిక్స్ లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



- ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు

**మంగళగిరి, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** బీసీల అభ్యున్నతి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ హయాం నుంచే టీడీపీ బీసీలకు అండగా నిలిచిందని, చంద్రబాబు ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ, శాసనమండలిలో తీర్మానాలు చేసి, న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. బీసీలపై వైసీపీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో తమతో కలిసి పోరాడాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతోందని రామాంజనేయులు తెలిపారు. గీత కార్మికులకు ఎక్సైజ్ షాపుల్లో 10 శాతం అవకాశం, వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో రిజర్వేషన్లు, నాయి బ్రాహ్మణుల వేతనాన్ని రూ. 25 వేలకు పెంపు, మత్స్యకారులకు వేట నిషేధ భృతి, నేతన్నలకు ఆర్థిక సాయం, చేనేత, పవర్‌లూమ్‌లకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

వైసీపీ పాలనలో బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసి, సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆయన ఆరోపించారు. టీడీపీ--బీసీల బంధాన్ని ఎవరూ విడదీయలేరని, బీసీ హక్కులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో బీసీలకు అదనంగా రూ. 50 వేల సాయం అందిస్తున్నామని, భవిష్యత్‌లోనూ బీసీలకు ప్రాధాన్యత కొనసాగుతుందని తెలిపారు.

# డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ని కలిసిన దనపాల సందీప్



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** జల్ జీవన్ మిషన్ 2.0 'అమరజీవి జలధార' కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రొద్దుటూరుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి జనసేన నాయకుడు మరియు నా సేన – నా వంతు కమిటీ రాష్ట్ర సభ్యుడు దనపాల సందీప్ ఘన స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు.

# రాజకీయం కాదు.. ప్రజలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు సాహిత్యాన్ని తన అక్షరాలతో సుసంపన్నం చేసిన సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులకు జన్మనిచ్చిన నేల ప్రొద్దుటూరు. బంగారం, వస్త్ర వ్యాపారంలో మినీ ముంబైగా, దసరా ఉత్సవాల్లో రెండో మైసూరుగా ప్రొద్దుటూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది.



**రూ.30,156 కోట్లతో భారీ తాగునీటి ప్రణాళిక :** రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ. 30,156 కోట్లతో 50,315 పనులను శ్రీకారం చుడుతున్నాం. 24,601 ఆవాసాల్లో ఇప్పటికే ఉన్న 61.60 లక్షల కుళాయి కనెక్షన్ల సామర్థ్యాన్ని పెంచి స్థిరీకరించడంతో పాటు, మరో 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లను అందిస్తున్నాం. మొత్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల' జల్ జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. 2019-24 మధ్య కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ. 26 వేల కోట్లు అందించినప్పటికీ, గత ఐదేళ్లలో రూ. 2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, అక్కడక్కడ పైపులైన్లు, చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. 2024తో పథకం గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి వస్తుందని, ప్రజల తాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరవని తెలిసినా కూడా పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేను – ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి విజ్ఞప్తి చేశాము. అలాగే, కేంద్ర జలశక్తి మంత్రి సి. ఆర్. పాటిల్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, వెంటనే పనులు ప్రారంభించాం. ఇప్పటికే రూ. 4,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశాము.

**గత మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యం :** 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2024 వంకు రాష్ట్రంలో తాగు నీటి మౌలిక వసతుల అభివృద్ధి క్రమంగా జరిగింది. ఈ కాలంలో 816 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, 1,072 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 28,086 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 1.18 లక్షల కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే, 'అమరజీవి జలధార' కార్యక్రమం ద్వారా కేవలం ఐదేళ్లలోనే ఈ మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యాన్ని జోడిస్తున్నాం. ఇందులో భాగంగా 1,426 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 13,075 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 77 వేల కిలోమీటర్ల పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నాం. అంటే, గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన మౌలిక వసతులతో పోలిస్తే, కేవలం ఈ ఐదేళ్లలోనే 50 శాతం నుంచి 175 శాతం వంకు అదనపు సామర్థ్యాన్ని సృష్టిస్తున్నాం. రూ. 9 వేల కోట్లతో 50,283 సింగిల్ విలేజ్ స్కీమ్స్, రెట్రోఫిట్టింగ్ పనులు, రూ. 19,500 కోట్లతో 32 మల్టీ విలేజ్ స్కీమ్స్ చేపడుతున్నాం. నీటి నాణ్యత పర్యవేక్షణ కోసం రూ. 1,624 కోట్లు కేటాయించాము.

ఉద్దానం నుంచి డోన్ వరకు, కర్నూలు నుంచి కుప్పం వంకు, గండికోట, పీఏబీఆర్, ఏలేరు, తాండవ, హిరమండలం, ధవళేశ్వరం తదితర జలాశయాల ఆధారంగా తాగు నీటి పథకాలను చేపడుతున్నాం. ఉద్దానం, ఏ.కొండూరు వంటి కిడ్నీ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, రాయలసీమలోని కరువు ప్రభావిత ప్రాంతాలు, పులివెందుల, పుంగనూరు, పలమనేరు, గోదావరి ప్రాంతాల్లోని కాలుష్య ప్రభావిత ప్రాంతాలు, మార్కాపురం వంటి ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోనూ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.

**నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి :** నీటి వనరులకు కొరత లేని ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కూడా తాగు నీటి భద్రతను దృష్టిలో పెట్టుకుని రూ. 6 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆక్వా సాగు, పారిశ్రామిక కాలుష్యం కారణంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ, ఉపరితల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. అందుకే నీటి నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి పరీక్షిస్తున్నాం. కాలుష్యానికి కారణమవుతున్న ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటూ షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం. అదే సమయంలో, తాగునీటి పథకాల్లో నీటి శుద్ధికి కీలకమైన ఫిల్టర్ బెడ్స్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ. 35 కోట్లతో 340 ఫిల్టర్ బెడ్స్‌ను పునరుద్ధరించాం. మరో 552 ఫిల్టర్ బెడ్స్‌ను రూ. 88 కోట్లతో పునరుద్ధరిస్తున్నాం. పంప్ హౌస్‌లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణతో పాటు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం, ఇతర అవసరమైన సహాయక కార్యకలాపాల కోసం రూ. 1,600 కోట్లు కేటాయించాం. నీటి శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లలోని ఓపెనింగ్స్‌కు రక్షణ వలలు ఏర్పాటు చేసి బల్లులు, పురుగులు వంటి జీవులు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

**తాళ్లమాపురానికి రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులు :** ప్రొద్దుటూరు నియోజక వర్గంలోని తాళ్లమాపురం పంచాయతీ ప్రజలు గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 6 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతుల కోసం ప్రజలు పలుమార్లు వినతులు సమర్పించినా, తగిన స్పందన లభించలేదనే ఆవేదన ఉంది. సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన యువత కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ఇలాంటి పరిస్థితులకు తావులేకుండా తాళ్లమాపురం, సాగిలి గొడ్డుపల్లి, ములవారిపల్లి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ. 1.5 కోట్లతో రెండు కిలోమీటర్ల సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లు నిర్మించడంతో పాటు, మరో రూ. 2 కోట్లతో 90 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్, నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్లు, ప్రత్యేక బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నాం. మొత్తం రూ. 3.5 కోట్ల విలువైన ఈ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రాంతం, పార్టీ అనే తేడా చూడదు. ప్రతి గ్రామానికి సమానంగా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం. అందుకు నిదర్శనంగా పులివెందులలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకానికి రూ. 280 కోట్లు కేటాయించి, ఏడు మండలాల్లోని 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించే చర్యలు చేపట్టాం. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లోనూ ఎలాంటి ప్రాంతీయ భేదాలు లేకుండా దాదాపు రూ. 2,500 కోట్లతో 'పల్లె పండుగ', 'అడవితల్లి బాట' వంటి అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

**కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపులు :** గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, జల జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల కింద పనులు చేపట్టిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎఫ్.ఐ.ఎఫ్.ఓ. విధానంలో బిల్లులను సకాలంలో చెల్లిస్తూ, కాంట్రాక్టర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ. 4,200 కోట్లను విడుదల చేశాం. పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చూడటం, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించడం, పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం" అన్నారు.

అంతకు ముందు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాంప్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కలిసి నడుస్తూ సభకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, జౌళి శాఖ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్. సవిత, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులు రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ.ఎన్.సి. గాయత్రి దేవి, కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధారల ప్రత్యేక పైలాన్



**ప్రొద్దుటూరు, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధార ప్రాజెక్టులకి సంబంధించిన ప్రత్యేక పైలాన్‌ను ప్రొద్దుటూరు పట్టణంలోని అమృత్ నగర్ కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ఆవిష్కరించారు.

జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధార ద్వారా చేపడుతున్న భారీ తాగునీటి ప్రాజెక్టుల వివరాలను ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా ఈ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. రూ. 30,156 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న తాగునీటి సరఫరా, సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, మల్టీ విలేజ్ స్కీమ్స్, గ్రామీణ నీటి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల వివరాలు ఈ పైలాన్‌లో పొందుపరిచారు.

అందులో గండికోట జలాశయం నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 గ్రామాల్లో చేపట్టిన సింగిల్ విలేజ్ స్కీమ్స్, 28 జిల్లాల పరిధిలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఫలకాలపై చెక్కారు.

# సేవా సేతు అభియాన్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** "సేవా సేతు అభియాన్" పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ -- ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా "సేవా సేతు అభియాన్" క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. "ప్రతి ఇంటికి సౌర విద్యుత్‌ను చేరువ చేయడం, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవా సేతు అభియాన్ ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.

ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు.

రూ. 78 వేల వరకు సబ్సిడీ

పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు:

1 కిలోవాట్‌కు రూ. 30,000

2 కిలోవాట్లకు రూ. 60,000

3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ. 78,000

వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు.

"సేవా సేతు అభియాన్" క్యాంపుల ద్వారా ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ పొందే ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన



కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ క్యాంపుల్లో బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొని వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పథకం అమలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తారని చెప్పారు.

ప్రతి ఇంటినీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమే లక్ష్యం అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తన ఇంటినే విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో సేవా సేతు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు సి. హెచ్. రమేష్, సుధాకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా 'ఏఎన్‌జీఆర్‌ఏయూ ఇన్నోవేటివ్ కిసాన్ నెట్‌వర్క్'గా రూపొందించిన ఆంగ్రూ వినూత్న రైతుల నెట్‌వర్క్ ను మంత్రి ప్రారంభించి, దానికి 'రైతు కోసం' అని నామకరణం చేశారు. రైతులకు వ్యవసాయ సలహాలు, సహాయ సహకారాలను సులభంగా అందించేందుకు 'రైతు కోసం' యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 'రైతు మిత్ర సలహావాణి' ఆర్‌ఐఏఏ కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ ఏజెంట్‌ను, 'అగ్రికల్చర్ బియాండ్ ఫార్మింగ్' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఒకే పట్టణంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు కీలక కళాశాలలు ఉండటం బాపట్లకు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, నేల సారం, చీడపీడల నివారణ, ఆధునిక వంగడాలు, అధిక దిగుబడులపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు అందిస్తున్నారని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విత్తనం వేసే దశ నుంచి పంట కోత వరకు సాంకేతికత, యాంత్రీకరణ, ఆధునిక పరికరాల రూపకల్పనలో తోడ్పడుతోందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటికి విలువ జోడించి మార్కెట్ చేసుకునేందుకు సహకరిస్తోందని తెలిపారు. ఈ మూడు విభాగాల అనుసంధానంతో రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా పంటలను, వంగడాలను అభివృద్ధి చేయాలని మంత్రి శాస్త్రవేత్తలకు సూచించారు. పాత పద్ధతుల్లోనే వ్యవసాయం కొనసాగిస్తే రైతులు నష్టపోయే పరిస్థితులు ఉంటాయని



పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రాధాన్య వంగడాలపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరేలా చూడాలని చెప్పారు. ఆయా వంగడాలను అందుబాటులోకి తీసుకువచ్చి, వాటి సాగుకు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

యాంత్రీకరణ, కృత్రిమ మేధపై దృష్టి సారించి రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కరణలు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం మంచి పరిశోధనలు చేస్తోందని ప్రశంసించారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల అభివృద్ధికి విశ్వవిద్యాలయ ఉపకులపతికి, శాస్త్రవేత్తలకు ప్రభుత్వం తరపున పూర్తి ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆధార్ లేదా గుర్తింపు వివరాలతో సమస్యను తెలియజేస్తే పరిష్కారాన్ని పొందగలిగే స్థాయికి ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ అభివృద్ధి చెందాయని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ అవకాశాలను వ్యవసాయ రంగంలో ఉపయోగించుకోవాలని సూచించారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉచిత విత్తనాల పంపిణీ, సకాలంలో విత్తనాల సరఫరా, భూసార పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, విపత్తుల సమయంలో నష్టపరిహారం వంటి చర్యలతో రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఉద్యాన రంగ అభివృద్ధికి మదనపల్లెలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. 1,00,000 కోట్ల ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు.

విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు సలహాలు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని తెలిపారు. 81 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి ఎంతోమంది రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వ్యాపారవేత్తలు ఎదిగారని కొనియాడారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వంషపాతం తగ్గినా నీటిని ఆదా చేసుకుంటూ సాగు కొనసాగించేలా సూక్ష్మ సాగునీటి విధానాలను ప్రోత్సహిస్తున్నామని, డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. వి. వినోద్‌కుమార్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, పరచూరు శాసనసభ్యులు వై. సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం. మాలకొండయ్య యాదవ్, విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఆప్కో ఛైర్మన్ సజ్జా హేమలత, రైతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పది లక్షల విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం కరువు

- బీసీ కోటాలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి
- వృత్తుల విభజనతో విశ్వకర్మల జనాభా తక్కువగా చూపిస్తున్నారు
- ప్రెస్‌క్లబ్ రౌండ్‌టేబుల్‌లో విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్




**హైదరాబాద్, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పది లక్షలకు పైగా జనాభా కలిగిన విశ్వకర్మ సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని విశ్వ కర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్ అన్నారు. సంప్రదాయ వృత్తుల ఆధారంగా విశ్వకర్మలను వేర్వేరు వర్గాలుగా విభజించి చూపడం వల్ల వారి వాస్తవ జనాభా తక్కువగా కనిపిస్తోందని పేర్కొన్నారు. బీసీ కోటాలో గవర్నర్ కోటా కింద విశ్వకర్మలకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమాజ నిర్మాణంలో విశ్వకర్మలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదని కాళిదాస్ అన్నారు. కులవృత్తుల ఆధారంగా విశ్వకర్మలను వేర్వేరు వర్గాలుగా పరిగణించడం వల్ల వారి సమష్టి జనాభా, సామాజిక బలం తెరమరుగవుతోందని తెలిపారు. విశ్వకర్మలందరినీ ఒకే సామాజిక సమూహంగా గుర్తించి, వారి జనాభా, సమస్యలు, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

పది లక్షలకు పైగా జనాభా ఉన్న సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. జనాభా ఉన్నప్పటికీ రాజకీయ నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకపోతే తమ సమస్యలు ప్రభుత్వాల దృష్టికి ఎలా వస్తాయని ప్రశ్నించారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల్లో విశ్వకర్మలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

ముఖ్యంగా గవర్నర్ కోటా కింద బీసీ సామాజిక వర్గానికి కేటాయించే ఎమ్మెల్సీ పదవుల్లో విశ్వకర్మలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వృత్తుల ఆధారంగా విడిపోయిన వారంతా సంఘటితమై హక్కుల సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ క్రమంలో నవంబర్ 14న జేఏసీ ఎన్నికలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఎన్నికల్లో విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన ఐటీ నిపుణులు, వైద్యులు, జర్నలిస్టులు, వివిధ రంగాల ప్రముఖులు, అధికారులు భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకుంటామని కాళిదాస్ తెలిపారు. విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం, బీసీ కోటాలో సముచిత వాటా, సంప్రదాయ వృత్తుల పరిరక్షణ తదితర అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విశ్వకర్మల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో విశ్వకర్మ జేఏసీ నాయకులు రవీంద్రాచారి, డాక్టర్ శ్యాంసుందర్, వీరశేఖరాచారి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విశ్వకర్మలు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో విద్యుత్ విప్లవం

- రెండున్నరేళ్లలో 11 కొత్త సబ్‌స్టేషన్లు.. 587 ట్రాన్స్‌ఫార్మర్లు
- 42 వేల కుటుంబాలకు గృహజ్యోతి..
- రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను భారీగా బలో పేతం చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో ఉన్న 19 సబ్‌స్టేషన్లకు అదనంగా తన రెండున్న రేళ్ల పదవీకాలంలో 11 కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్పారు. విద్యుత్ భవన్‌లో రైతులకు వ్యవసాయ విద్యుత్ వినియోగ నియంత్రికలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎదురైన భూ సమస్యలను పరిష్కరించి, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించామని తెలిపారు. కొన్ని ఇప్పటికే ప్రారంభం కాగా, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

**గొండ్యాలలో 132 కేవీ సబ్‌స్టేషన్..**

హన్వాడ మండలం గొండ్యాలలో 132 కేవీ సామర్థ్యంతో భారీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని యెన్నం వెల్లడించారు. అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి రైతులు, గృహ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**587 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ..**

నియోజకవర్గంలో ఇప్పటివరకు సింగిల్‌ఫేజ్, త్రీఫేజ్ కలిపి 587 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్ల అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

**42 వేల కుటుంబాలకు గృహజ్యోతి..**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు 42 వేల కుటుంబాలు లబ్ధి పొందు తున్నాయని యెన్నం తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడమే పథకం లక్ష్యమన్నారు.

**13 వేల నుంచి 19 వేల మెగావాట్లకు డిమాండ్..**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గతంలో సుమారు 13 వేల మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 19 వేల మెగావాట్లకు పెరిగిందని యెన్నం తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త ప్రాజెక్టులతో పాటు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని యెన్నం అన్నారు.

గ్రామాల్లో రాజకీయ విభేదాలు అభివృద్ధికి అడ్డంకిగా మారనివ్వబోమని స్పష్టం చేశారు. "ఏ పార్టీకి చెందిన సర్పంచ్ అయినా గ్రామాభివృద్ధి కోసం వస్తే సహకరిస్తాం. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధే లక్ష్యం. ప్రజల సమస్యల పరిష్కారానికి 24 గంటలూ అందుబాటులో ఉంటాం" అని యెన్నం పేర్కొన్నారు.

# అసాంఘిక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం

- శాంతిభద్రతల పరిరక్షనకే ప్రథమ ప్రాధాన్యత
- తుకారాం గేట్ ఎస్హెచ్ఓ ఎస్ ఎం బషీర్ అహ్మద్
- అడ్డగుట్ట తుకారాంగేట్ ఠాన పరిధిలోకి
- ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో సమావేశం



**అడ్డగుట్ట, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** అడ్డగుట్ట డివిజన్ లోని పూర్వంలాగే తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం స్థానిక వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, అడ్డగుట్ట హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు, సంఘ సేవకులు, సామాజిక కార్యకర్తలతో తుకారాంగేట్ పోలీసులు అవగాహణ సదస్సు నిర్వహించారు. బుద్ధనగర్ గంగాపుత్ర సంఘం భావనలో జరిగిన ఈ సమావేశంలో స్థానిక సమస్యలు, పరిష్కార మార్గాలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడి కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. మద్యపానం, గంజాయి వినియోగం ఈ మధ్య కాలంలో ఎక్కువగా పెరిగిందని, విద్యా సంస్థల సమీపంలో మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా కొన్ని పాన్ షాపుల వద్ద మైనర్ లు దూమపానం చేస్తున్నారని తెలిపారు. ప్రధాన రోడ్లపైనే ఉన్న మద్యం దుకాణాలు, బారు వద్ద సరైన పార్కింగ్ స్థలం లేక పోవడంతో ఫుట్ పాత్ ను ఆక్రమించడంతో పాటు రోడ్ల పైనే ద్విచక్రవాహనాలు నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి వాహన దారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వాటిని అరికట్టడం కోసం పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో యువత గుమికూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఇంతకు పూర్వం ఉన్న విధంగానే తమ ప్రాంతం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకు రావాలని తాము చేసిన పోరాటానికి పోలీసులు కూడా సహకరించారని వారికి అడ్డగుట్ట హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ ఎస్ఎం బషీర్ అహ్మద్ మాట్లాడుతూ బస్తీవాసులు పోరాటం ఫలించిందని అభినందించారు. అడ్డగుట్ట వాసులు ఎటువంటి సమస్యలు వచ్చిన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్లోనే పిర్యాదు చేయాలని తెలిపారు. మల్కాజిగిరి సీపీ బీ సుమతి, డీసీపీ శ్రీధర్ ఆదేశాల మేరకు సంఘ విద్రోహ చర్యల కట్టడికి కట్టుబడి ఉన్నామని, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. యువత మత్తుపదార్థాల బారిన పడకుండా, రాత్రివేళల్లో త్వరగా ఇంటికి వచ్చే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉంటుందని పేర్కొన్నారు. 24గంటలు పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అనుమానాస్పద స్థితులు, వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచార మివ్వడం ద్వారా శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి నిందితులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు కిరణ్ కుమార్, యశోధర్ పాల్గొన్నారు.

# బీసీలకు సామాజిక న్యాయం రాజ్యాంగ హక్కు..



**హైదరాబాద్, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** శంషాబాద్‌లో గొల్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద సామాజిక న్యాయం బీసీ ల రాజ్యాంగ హక్కు అని జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేయాలని డిమాండ్‌తో టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది.. ఈ సభకు ముఖ్య అతిథిగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ లు హాజరైయ్యారు.. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు..

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన నిర్వహించింది. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి సమగ్రంగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. బీహార్‌తో పాటు తెలంగాణ కూడా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కులగణన కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదు.. దేశంలోని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశం. దేశవ్యాప్తంగా కులగణన జరగాలి.. ఇదే మా ప్రధాన డిమాండ్. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు కులగణన కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. సమావేశాలు, ప్రజా సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్సుల ద్వారా కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అన్ని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలు ఐక్యంగా నిలబడి సామాజిక న్యాయం కోసం పోరాడాలి. తెలంగాణ ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటాల్లో ప్రజల ఐక్యతే విజయానికి కారణమైంది. అదే స్ఫూర్తితో ఇప్పుడు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పోరాడాలి. అనేక వెనుకబడిన వర్గాలకు ఇప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదు. గ్రామపంచాయతీ స్థాయి నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు అన్ని స్థాయిల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. తెలంగాణలో కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ తీర్మానం చేసింది. కేబినెట్ నిర్ణయం తీసుకుని ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.





దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితి వంటి అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్ల విషయంలో ప్రామాణికమైన గణాంకాలు అత్యంత కీలకం. ప్రామాణికమైన గణాంకాల కోసం దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలి. ప్రతి సామాజిక వర్గం జనాభా, సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు రావాలి అన్నారు.. కులగణన ఆధారంగా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం నిర్ణయించే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన అధికారాలను వినియోగించి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలి. గ్రామసభల్లో కులగణనకు అనుకూలంగా తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలి. కులగణన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి తెలంగాణ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కులగణన - సామాజిక న్యాయానికి పునాది. అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు..

## కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



**పాలేరు అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణం,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఖమ్మం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలాలకి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఖమ్మం రూరల్ మండలంలో 51 మంది లబ్ధిదారులకు రూ.50,05,500 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీలో 70 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.23,66,500, ఖమ్మం రూరల్ మండలంలో 95 మందికి రూ.28,79,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రైవేట్,కార్పోరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేద,మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకాల ద్వారా మొత్తం 216 మంది లబ్ధిదారులకు రూ.1,02,51,000 మేర ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు.తమది ప్రజా ప్రభుత్వమని,గత పాలకుల కంటే రెండు మూడు రెట్లు ప్రజలకు లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట వీరభద్రం,ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్,పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాడ్వాయి మండలం మాలల నూతన కమిటీ ఎన్నిక



**తాడ్వాయి అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** తాడ్వాయి మండలం నూతన మాలల కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు భూపల్లి సంగయ్య తెలిపారు. అధ్యక్షులుగా గైని రాజలింగం, ఉపాధ్యక్షులుగా ఇటుకేలా రాజనర్స్, ముద్దునరేష్, గౌరవాధ్యక్షులు గా పులి ప్రభాకర్, ప్రధానకార్యదర్శి గోలకొండ స్వామి, మరాఠి రమేష్, ప్రచార ప్రచారక కార్యదర్శిగా గొల్లబోయిన శ్రీహరి, మండల్ కార్యదర్శిగా ఆవుల బాలరాజు, కార్యదర్శిగా కుదేల్ రమేష్, జిల్లా కార్యదర్శి గోలకొండ నర్సింలు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ మెంబర్ రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా కమిటీ మెంబర్ సత్యం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**తాడ్వాయి, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** తాడ్వాయి, తాడ్వాయి మండలంలోని కాలేజీ వాడి గ్రామనికి చెందిన గడ్డం హేమచంద్రిక అనే విద్యార్థి ఇటీవల హాస్టల్ లో గాయపడిగా ఆ విద్యార్థిని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు, పాప కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన గడ్డం శివలింగం గుండెపోటు తో మరణించగా బాధ్యత కుటుంబాన్ని ఆయన పరామర్శిచి ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ ముదాం నర్సింలు,కాలోజువాడి గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి, టిఆర్ఎస్ నాయకులు కపిల్ రెడ్డి, తాజోద్దీన్, కొర్ని నర్సింలు, మంగా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## హయత్‌నగర్ లేబర్ అడ్డా తరలింపునకు నిర్ణయం

- కాలనీవాసుల ఇబ్బందులకు పరిష్కారం చూపుతామన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**హయత్‌నగర్ అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పందించారు. ఆదివారం లేబర్ అడ్డాను సందర్శించిన ఆయన అక్కడి కార్మికులు, చుట్టుపక్కల కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**లేబర్ అడ్డాతో ఇబ్బందులు..** చుట్టుపక్కల కాలనీవాసులు మాట్లాడుతూ లేబర్ అడ్డా కారణంగా ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుపై మూత్రవిసర్జనచేయడం, పేకాట ఆడటం, రోడ్డు పక్కనే పడుకోవడం వంటి కారణాలతో మహిళలు, ఇతర స్థానికులు కాలనీల్లోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. లేబర్ అడ్డాను మరోచోటుకు తరలించాలని కోరారు.

**కార్మికులకు సౌకర్యాలు కల్పిస్తాం..** ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగాఇదే ప్రాంతంలో కార్మికులు జీవనోపాధి పొందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులకు ఇబ్బందులు కలగకుండా, అదే సమయంలో స్థానిక కాలనీవాసులకు సమస్యలు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

రేడియో స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్ ప్రాంతంలో కార్మికుల కోసం మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు కార్మికులు అంగీకారం తెలిపారు.

**ట్రాఫిక్ పోలీసులకు సూచనలు..** లేబర్ అడ్డా మార్పు, కార్మికుల రాకపోకల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్మికుల ఉపాధికి ఆటంకం కలగకుండా, స్థానికులకు అసౌకర్యం లేకుండా సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.

**కాలనీవాసుల హర్షం..** లేబర్ అడ్డాను ప్రక్కకు తరలించేందుకు నిర్ణయం తీసుకోవడంతో చుట్టుపక్కల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

## మాజీ ఎంపీపీ బానోత్ మాధవి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి.



**ఏన్కూరు , అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏన్కూరు మండల మాజీ ఎంపీపీ బానోత్ మాధవి– రామారావు తల్లి ఝుంకు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ ఆదివారం భగవాన్ నాయక్ తండ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఝుంకు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్వర్ణ నరేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లచ్చిరాం నాయక్, విజయ భాయి, బొర్ర రాజశేఖర్, కొప్పుల ప్రభావతి రెడ్డి, లేళ వెంకటరెడ్డి, మండల నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో దసరా షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం.



**నిజామాబాద్ , అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజామాబాద్ నగరంలో పండుగ సందడి మొదలైంది.సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదురుగా,బస్టాండ్–రైల్వే స్టేషన్ సమీపంలో "దసరా షాపింగ్ ఫెస్టివల్" ఆదివారం ఘనంగా ప్రారంభమైంది.ఇంటికి అవసరమైన అనేక రకాల వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో కుటుంబాలు పండుగ షాపింగ్‌ను ఒకేచోట పూర్తి చేసుకునే అవకాశం కలుగుతోంది.పిల్లల కోసం ఉయ్యాలలు,రైడ్స్‌తో పాటు భారీ ఇన్‌ఫ్లేటబుల్ స్లైడ్‌ను కూడా ఏర్పాటు చేశారు.ఈ ఫెస్టివల్ దసరా,దీపావళి పండుగల వరకు కొనసాగనుంది.కాంగ్రెస్ నాయకులు కూరగాయల రమేష్ ప్రత్యేక అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఫెస్టివల్‌ను ప్రారంభించారు.డిప్యూటీ మేయర్ భర్త,ఎంఐఎం నగర అధ్యక్షులు షకీల్ అహ్మద్ ఫాజిల్ కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఐయూఎంఎల్ నాయకులు షేక్ ముజాహిద్,అశోక్ రెడ్డి,విలాస్ రెడ్డి,నయీమ్ ఖమర్,రఫీక్ ఖురేషి,హలీమ్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా మహదేవ్ ఇన్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్ లాంచింగ్





**నాగోల్, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్: నాగోల్మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌కు భూమి పూజ, బ్రోచర్ ప్రారంభోత్సవ కార్యక్రమం నాగోల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజలో పాలొని, ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, నివాస అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ఆధునిక వసతులతో గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం అవసరమని అన్నారు.ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన నిర్మాణాలను అందించేందుకు నిర్మాణ సంస్థలు కృషి చేయాలని సూచించారు. మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ చేపడుతున్న ప్రాజెక్టు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బీ. లింగయ్య యాదవ్, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ సీనియర్ నాయకులు పెరాల శేఖర్, మాజీ కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గాండే, సింగర్ నల్గొండ గద్దర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా రెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, నిర్మాణ రంగ ప్రతినిధులు, మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హైదరాబాద్‌లో ఘనంగా అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్

- ముగ్గురు ప్రముఖ విద్యావేత్తలకు పురస్కార ప్రదానం
- భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన వారికి ఘన సత్కారం





**నాగోల్ , అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన ప్రముఖ విద్యావేత్తలను ఘనంగా సత్కరించారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ యూజీసీ ఛైర్మన్, ప్రస్తుతం ఐఐఎం కలకత్తా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న పద్మశ్రీ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్, ఐఐఎం బెంగళూరు మాజీ ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ బి. మహదేవన్, విశాఖపట్నంలోని విజ్ఞాన విహార విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపాల్ డి. రామకృష్ణారావులను పురస్కారాలతో సత్కరించారు.జాతీయ విద్యా విధానం-2020 అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన, ఆన్‌లైన్ విద్యా విస్తరణలో ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ, సంస్కృత విద్య, మేనేజ్‌మెంట్ రంగాల్లో ప్రొఫెసర్ బి. మహదేవన్ చేసిన కృషిని ప్రశంసించారు. విద్యా విధానాల రూపకల్పన, ఉపాధ్యాయ శిక్షణ, నైతిక విద్య, పాఠశాల విద్యలో సామాజిక పరివర్తనకు డి. రామకృష్ణారావు అందించిన సేవలను గుర్తుచేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహ సర్కార్యవాహ్ పూజ్య సి.ఆర్. ముకుంద జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నారాయణ్ లాల్ గుప్తా అధ్యక్షత వహించారు.పరమపూజ్య త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనం అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భారతీయ విద్యా చింతన, గురు పరంపర, విలువలతో కూడిన విద్యా విధానం దేశ భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు. విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం ద్వారా ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ కార్యదర్శి ఆచార్య గీతా భట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర కపూర్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన కిషన్ జీ, ఏలూరి యాదయ్య, డాక్టర్ కె. భాస్కర్, జగన్, దయానంద్ ఆర్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతినిధులు, విద్యావేత్తలకు తెలంగాణ రాష్ట్ర శాఖ కన్వీనర్ ఏలూరి యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## హకీంపేట్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం

- కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం: రాములు నాయక్



**శామీర్‌పేట , అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో హకీంపేట్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా సాగింది. అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయూ) అభ్యర్థులకు మద్దతు ఇచ్చి బాణం గుర్తుపై ఓటు వేయాలని నాయకులు కార్మికులను కోరారు.మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు డిపోలోని కార్మికులను కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ హకీంపేట్ డిపో కార్మికుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అండగా ఉంటామని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. మహిపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. రమేష్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి. వెంకటేశం, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. నాగరాజు, హకీంపేట్ డిపో అధ్యక్షుడు తులసీరామ్, కార్యదర్శి పవన్ యాదవ్, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు వైస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎస్. మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎ. నగేష్ యాదవ్, బి. కిషోర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎస్. వేణుగోపాల్ రెడ్డి, ఆర్. శ్రీనివాస్ యాదవ్, వి. నర్సింహారెడ్డి, విష్ణు, ఎస్. ఆనంద్, పి. బాలరాజు, వి. శేషాంత్, భరత్ కుమార్, నాగరాజు, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు కృష్ణ, శ్రీశైలం, పుష్పలత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సమీక్ష సమావేశంలో ప్రోటోకాల్ పాటించని ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

- సిపిఎం మంచాల మండల కార్యదర్శి రావుల జంగయ్య.
- సిపిఎం పార్టీ సర్పంచ్ ల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే నియంత పోకడలు మానుకోవాలి



**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచాల మండలం కేంద్రం లో జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ గ్రామ సర్పంచ్ ల తో కలిసి సిపిఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో సిపి ఎం పార్టీ సర్పంచ్ లు చెప్పిన సమస్యలు సిపిఎం పార్టీపై నిం దలు వేస్తూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సర్పంచ్ లకు ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ కా ర్యకర్తలను అనుచరులను సమావేశానికి హాజరుపరిచి ప్రజాప్రతినిధులను అవమానించిన ఎ మ్మెల్యే ఆయన ప్రవర్తన మార్చుకోవాలని అన్నారు. ఆయన ప్రవర్తన మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పవలసి వస్తుందని తెలిపారు సర్పంచ్ లను గౌరవించకుంటే రాబోయే కాలంలో ప్రజలే చూసుకుంటారని తెలిపారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు స ర్పంచ్ ల భర్తలు సమావేశానికి హాజరవుతున్నారని ఇదెక్కడి న్యాయమని అన్నారు. ప్రోటకల్ పాటించాలని విజ్ఞప్తి చేశారు అలాగే సిపిఎం పార్టీపై నిందలు వేయడం మానుకోవాలని అన్నారు ఈకార్యక్రమంలో రంగాపూర్ గ్రామసర్పంచ్ నేనావత్ బాలకృష్ణ నాయక్ చెన్నారెడ్డి గూడా గ్రామసర్పంచ్ పగడాల విజయ ఎల్లమ్మతండా సర్పంచ్ సపవట్ జవహర్ లాల్ బండాలేమూర్ గ్రామసర్పంచ్ పాతులోత్ శ్రీనివాస్ నాయక్ సిపిఎం పార్టీ మంచాల మండలం కార్యవర్గ సభ్యుడు అన్నారం లెనిన్ కాళ్ళ జంగయ్య ఆవుల యాదయ్య సీనియర్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ ఆలీ పగడాల వెంకటేష్ ,నూకం రవి ,ముదిరాజ్ యస్ డి హఫీజ్ పాష తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నిరసనలకు పిలుపు

- మల్కాజిగిరిలో 6న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



**మల్కాజిగిరి, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలకు సిద్ధమైంది. ఈ ప్రక్రియ రాజ్యాంగ స్ఫూర్తికి, ఓటు హక్కుకు విఘాతం కలిగించేలా ఉందని టీపీసీసీ నాయకుడు, మల్కాజిగిరి పరిశీలకుడు సమీర్ కౌశల్ ఆరోపించారు. అక్టోబర్ 6న మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు నాయకత్వంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొంటాయని చెప్పారు. అక్టోబర్ 8న ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఏ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ట్యాంక్‌బండ్‌పై భారీ నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించారు.అక్టోబర్ 7న బూత్ స్థాయి ఏజెంట్లకు అందే ఎస్ఐఆర్ దరఖాస్తులపై సంతకాలు చేయకుండా నిరసనలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, రాజ్ జితేంద్రనాథ్, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, బి.కె. శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, ఏకే మురుగేష్, జి.డి. సంపత్‌గౌడ్, రామచందర్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

## బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం

- రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, నవదీప ఫౌండేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం



**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, నవదీప ఫౌండేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులు, వారి కుటుంబ సభ్యులు, అవసరమైన వారికి సుమారు 300 మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు.సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.పేద ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు కావడం ద్వారా అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు.

## బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణకు ఘన సన్మానం



**పినపాక, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా, బయ్యారం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ సారం రామకృష్ణను పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆదివారం పినపాక మండలం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.బయ్యారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది రామకృష్ణను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ శాఖకు అందించిన సేవలను అధికారులు, సిబ్బంది గుర్తుచేసుకున్నారు. బయ్యారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు.పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సారం రామకృష్ణకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరెడ్‌మెట్‌లో కాంగ్రెస్ ప్రభంజనం.. జోరుగా చేరికలు

- మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో పాటు 500 మంది కాంగ్రెస్‌లో చేరిక





**నేరెడ్‌మెట్, అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని నేరెడ్‌మెట్ 136వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు ఆధ్వర్యంలో 136వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఆమెతో పాటు డివిజన్‌కు చెందిన సుమారు 500 మంది నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత్‌రావు కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో పాటు పార్టీలో చేరిన నాయకులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఒకేసారి కాంగ్రెస్‌లో చేరడంతో కార్యక్రమం సందడిగా సాగింది.సంఘాలు, కాలనీల నుంచి భారీ స్పందననేరెడ్‌మెట్ రజక సంఘం, నేరెడ్‌మెట్ ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల సంఘం, వివేకానందపురం యువత, ఆర్‌కే పురం యువత, సీబీఎన్ కాలనీ యువతతో పాటు వివిధ కాలనీలకు చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయా సంఘాలు, కాలనీలకు చెందిన ప్రతినిధులు స్థానిక సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై చర్చిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి రాజకీయంగా మరింత చురుకుగా పనిచేయాలనే ఉద్దేశంతో పార్టీలో చేరినట్లు తెలిపారు.మైనంపల్లి ఆధ్వర్యంలో చేరికలకు ఊపుమల్కాజ్‌గిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నేరెడ్‌మెట్‌లో చోటుచేసుకున్న ఈ భారీ చేరికలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మాజీ కార్పొరేటర్ స్థాయి నాయకురాలితో పాటు వివిధ సామాజిక సంఘాలు, యువజన వర్గాలు, కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నేరెడ్‌మెట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి వర్గాన్ని కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకుల సమన్వయంతో కృషి చేస్తామని పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తాంకాంగ్రెస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ నేరెడ్‌మెట్ డివిజన్‌లో పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తామని చెప్పారు. వివిధ సంఘాలు, కాలనీల ప్రజల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలుఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.ఆర్. ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు రాఘవన్, శ్యామ్, శ్రీనివాస్ యాదవ్, సాయి, భాస్కర్, ఆల్బర్ట్, సుధీర్, రాములు, రమేష్, జాన్, జోషియా, రజక సంఘం అధ్యక్షుడు కృష్ణ, శేఖర్, శివ, ప్రభాకర్, భరత్, ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు రాజేందర్, ఉస్మాన్, పద్మారావు, సత్తిబాబు, రమేష్, అశోక్, మల్లేష్, ప్రవీణ్, దేవ్, అశ్విన్, మధు యాదవ్ తదితర సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ తల్లిని దర్శించుకున్న యువతరం యూత్ నాయకులు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన యువత
- ఆధ్యాత్మికతతో యువతలో ఐక్యత, సేవాభావం పెంపొందించాలి
- కొండపోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామాభివృద్ధికి కృషి
- యువతరం యూత్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ యాదవ్



**గజ్వేల్ , అక్టోబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామానికి చెందిన యువతరం యూత్ నాయకులు ఆదివారం భక్తిశ్రద్ధలతో కొండపోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా యువతరం యూత్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ యాదవ్ మాట్లాడుతూ యువతలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఆధ్యాత్మికత ద్వారా ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేవాలయ దర్శనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు యువతకు మంచి మార్గాన్ని చూపుతాయని పేర్కొన్నారు. భక్తితో పాటు సేవాభావాన్ని అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.కొండపోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. యువతరం యూత్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి యువతను చైతన్యపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు గుగ్గులోత్ శివకుమార్, ఉపాధ్యక్షులు రుద్రారం రాజు, ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన నాగరాజు, కోశాధికారి దివిటి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలు గొడుగు శ్రీకాంత్, గూడూరి ప్రశాంత్, కార్యవర్గ సభ్యులు డాకూరి మహిపాల్, సింగరమైన ప్రవీణ్, చిర్ల స్వామి, రాజయ్య, బాబు, దుర్గయ్య, శేఖర్, బిక్షపతి, కృష్ణ, అనిల్, నర్సింలు, యాదగిరి, శేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్చ్యూన్ అవెన్యూ అభివృద్ధికి రూ.88 లక్షలు

**నేరెడ్‌మెట్, అక్టోబరు05 (జర్నలిస్ట్ ఫైల్) :**
యాప్రాల్ డివిజన్–189, కౌకూర్ పరిధిలోని ఫార్చ్యూన్ అవెన్యూ కాలనీలో రూ.88 లక్షల వ్యయంతో రెండు ప్రధాన వీధుల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కాలనీ పెద్దలు, స్థానికుల ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ.. కాలనీలో చాలాకాలంగా ఉన్న రోడ్ల సమస్యకు సీసీ రోడ్ల నిర్మాణంతో పరిష్కారం లభించనుందని తెలిపారు. వర్షాకాలంలో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.కౌకూర్–యాప్రాల్ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్న మైనంపల్లి హనుమంత్‌రావుకు, పరిపాలనా పరంగా సహకరిస్తున్న మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సాంచిత్ గంగ్వార్‌కు మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.కాలనీ ప్రతినిధులు ఎం. సుధాకర్, పి. సుబ్బారావు, నాగరాజ్‌రావు, పి. భాస్కర్, అబ్దుల్ సలాం, ఖాదర్ హుస్సేన్, సునీల్, గౌతమ్‌రాయ్, జి. మురళి, చంద్రారెడ్డి, సత్యనారాయణ్, టి. నంబియార్, మునిబాబు, సతీష్‌చంద్ర, రవినేష్, వెంకటేశ్వర్లు, ముఖేష్, రాజు, యోగప్రభ, కళా భారతి, వంశీప్రియ, శైలజ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు శివరాజ్, మల్లేష్, ఆసిఫుల్లా ఖాన్, సయ్యద్ అస్లాం, శ్రీశైలం యాదవ్, ప్రవీణ్, భరత్, హేమంత్ తదితరులు హాజరయ్యారు.



# పిజిఆర్ఎస్‌కు 595అర్జీలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో 595అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారు సంతృప్తి మేరకు పరిష్కారం కావాలని, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. అర్జీలు పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో పి. జి. ఆర్. ఎస్ కు మొత్తం 595 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి. జి. ఆర్. ఎస్ కు 360, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి. జి. ఆర్. ఎస్ కు 159 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 8 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 34 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 26, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 8 అర్జీలు అందాయి.

అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా అటవీ అధికారి ఎం. హిమ శైలజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె. వి. వి సత్యనారాయణ, ఎ. పిఎం. ఐ. పి ఎల్. వజ్రశ్రీ, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, సర్వ శిక్షా అభియాన్ ఎపిసి పద్మావతి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలి



- **పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలి**
- **కమిషనర్ మయూర్ అశోక్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, దివ్యాంగులకు ర్యాంపులు, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక వసతులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. లోపాలను సంబంధిత ఏఈలు వెంటనే పరిష్కరించాలన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎంపిక చేయాలని సిటీ ప్లానర్‌కు, స్ట్రాంగ్ రూమ్‌లు, కీలక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌కు సూచించారు. ఈ నెల 10, 12 తేదీల్లో రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ కమిషనర్-1ను ఆదేశించారు.

శిక్షణ కోసం అవసరమైన మాస్టర్ ట్రైనర్లను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న వివిధ శాఖల అధికారులు, నగరపాలక సంస్థ అధికారుల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ సెల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి. సాంబశివరావు, బి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# భూ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

- **గోవాడలో 1,906 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు**
- **రాజముద్రతో పాస్‌పుస్తకాల పంపిణీ..**



**అమృతలూరు (జర్నలిస్ట్ ఫైల్):** అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో 1,906 మంది అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం పంపిణీ చేశారు. రీ-సర్వే ప్రక్రియ అనంతరం ప్రభుత్వం జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతుల భూ హక్కులను పరిరక్షించడం, భూ వ్యవహారాల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. 'మీ భూమి-మీ హక్కు' నినాదంతో వ్యక్తిగత ఫొటోలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి భూమిపై హక్కుకు అధికారిక గుర్తింపుతో పాటు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. రీ-సర్వే పూర్తవడంతో భూ వివరాల్లో స్పష్టత వచ్చి వివాదాలు తగ్గుతాయని అన్నారు.

అమృతలూరు మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటివరకు బోడపాడులో 360, ఎలవర్రులో 648, కోరుతాడిపర్రులో 578, పెదపూడిలో 862, అమృతలూరులో 1,836 పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

గోవాడలో తాజాగా 1,906 పాస్‌పుస్తకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్యాపర్రులో రీ-సర్వే పూర్తయిందని, నవంబర్‌లో సుమారు 420 మంది రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మిగిలిన గ్రామాల్లోనూ రీ-సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన రైతులకు పాస్‌పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదు : ఎమ్మెల్యే నసీర్

- **పదేళ్లుగా అభివృద్ధి గురించి పట్టించుకున్నారా?**
- **ఎక్కడైనా రోడ్లు నిర్మించిన దాఖలాలు ఉన్నాయా ?**
- **శివారు కాలనీలను గాలికొదిలేశారు**
- **రెండేళ్లలోనే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశాం**
- **మరో రెండేళ్లలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**
- **రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** పదేళ్లుగా కనీసం రోడ్ల గురించి పట్టించుకున్న దిక్కు లేదు. ఎక్కడ రోడ్లను అక్కడ వదిలేశారు. తట్టి మట్టి కూడా వేసింది లేదు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశాం. అభివృద్ధిపై ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక కబడ్డీగూడెం, సంగడిగుంట, నిమ్మయ్యగారి బజారు, హిద్వా నగర్, ఆలీనగర్ ప్రాంతాల్లో రూ.2 కోట్లతో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. తొలుత ఆ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని గత పదేళ్ల కాలంలో 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారని మండిపడ్డారు.

అత్యవసరమైన ప్రాంతాల్లో సైతం రోడ్లను నిర్మించకుండా ప్రజల జీవితాలతో చెలగాటమాడారని విమర్శించారు. సంగడిగుంట ప్రాంతంలో ఏడు లైన్లకుగాను ఐదు లైన్లను సీసీ రోడ్లుగా నిర్మిస్తున్నామని తెలిపారు. దీంతోపాటు సంగడిగుంట మెయిన్ రోడ్డును నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశామని తెలిపారు. వైసీపీ హయాంలో అభివృద్ధి ఎంత మేర జరిగిందో ? సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంత ప్రగతి సాధించామో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రెండున్నరేళ్ల కాలంలో శివారు కాలనీల్లో సైతం రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు చేశామన్నారు. నిరుపేదలకు శాశ్వత నివేశన పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. వరద ముంపు శాశ్వత నివారణకు మొండిగేటు వద్ద రూ. 8 కోట్లతో వెంట్ పెంచుతున్నామని, నందివెలుగు బ్రిడ్జి నిర్మాణాన్ని మరో నాలుగు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందించబోతున్నామని చెప్పారు. కేవలం రాజకీయాలు చేసి లబ్ధి పొందాలంటే ప్రజలకు సహించబోరని హెచ్చరించారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను, కూటమి నాయకులు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. ప్రజలకు జవాబుదారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెల వ్యవస్థ ద్వారా గ్రీవెన్స్ తీసుకుంటుందని చెప్పారు. రాబోయే రెండేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముందడుగు వేస్తున్నామని తెలిపారు.

# ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షిక విచారణ : ఎస్పీ వకుల్ జిందాల్

- **నిర్ణీత గడువులో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమంలో ఎస్పీతో పాటు డీఎస్పీ స్థాయి అధికారులు, ఇతర పోలీస్ అధికారులు మొత్తం 162 ఫిర్యాదులను స్వీకరించారు.

ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై వాస్తవాలను నిష్పాక్షికంగా నిర్ధారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కరించిన అనంతరం తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యలను ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా పీజీఆర్ఎస్‌లో సిబ్బంది సహకరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా సాయినగర్‌లోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ రమణమూర్తి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరజీవి జలధార పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



- **రూ. 30,156 కోట్ల వ్యయంతో కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి జల్ జీవన్ మిషన్ 2.0 - అమరజీవి జలధార**

**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామంలో జల్జీవన్ మిషన్ 2.0 అమరజీవి జల ధార పైలాన్‌ను ఆవిష్కరించడంతో పాటు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు తాగునీరు అందించే పనులకు సంబంధించిన 13 శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నియోజకవర్గం లోని మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మైదుకూరు ఎక్సైజ్ పరిధిలో 9 మద్యం దుకాణాలు



- **అక్టోబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 8న బహిరంగ లాటరీ**

**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ 2026-27లో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. లాటరీ విధానంలో పారదర్శకంగా మద్యం దుకాణాల లైసెన్సులను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. మైదుకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 9 జనరల్ కేటగిరీ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో 6, రూరల్ పరిధిలో 1, దువ్వూరు మండలంలో 2 దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణాల లైసెన్సుల కోసం 2026 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 6 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లేదా మైదుకూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి దరఖాస్తుకు రూ. 1,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి దరఖాస్తుతో పాటు రూ. 3 లక్షల నాన్-రిఫండబుల్ డీడీని 'జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, వైఎస్ఆర్ కడప' పేరిట సమర్పించాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అనంతరం లభించే చలానా ద్వారా సమీప ట్రెజరీ లేదా బ్యాంకులో రూ. 3 లక్షలు చెల్లించి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దరఖాస్తుల ఎంపిక ప్రక్రియను అక్టోబర్ 8న వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బహిరంగ లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. నూతన మద్యం పాలసీ ప్రకారం లైసెన్స్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని నాలుగు సమాన విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజును మూడు సమాన విడతల్లో చెల్లించే అవకాశం కల్పించినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. నూతన మద్యం పాలసీ 2027 సెప్టెంబర్ 30వంకు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

# కవిరాజు యువజన సదస్సులో వివా-వివిఐటి విద్యార్థుల ప్రతిభ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ కవి, సంఘసంస్కర్త కవిరాజు త్రిపురనేని రామస్వామి తెనాలి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెనాలి విజ్ఞాన వేదిక నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివా-వివిఐటి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ స్థాయిల్లో ప్రథమ బహుమతులను సాధించారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో వివిఐటియూ విద్యార్థిని సోనాలి రాణి దాస్ డిగ్రీ స్థాయిలో, వివా విద్యార్థిని జి. జ్ఞాననందిని ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రథమ బహుమతులు అందుకున్నారు. కార్తికేయ కశ్యప్, సాత్విక, పాంచజన్య, కుందన్ ప్రతీక్ ప్రోత్సాహక బహుమతులు పొందారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, శాసనమండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేదిక కార్యదర్శి ముత్తేవి రవీంద్రనాథ్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో వివిఐటియూ సీడీఎస్ డిప్యూటీ డైరెక్టర్ డా. యు. మాధవ్, పబ్లికేషన్ డివిజన్ సమన్వయకర్త డా. మోదుగుల రవికృష్ణ, వివా ఉపాధ్యాయులు ఏ. వెంకటనారాయణ, పి. వి. వి. సత్యవతి పాల్గొన్నారు.

# ఎంత ఎదిగినా ఎంతో ఒదిగి ఉండే ప్రజానేత లేళ్ళ అప్పిరెడ్డి

- **స్టేట్ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలూరి**





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** సామాన్య కుటుంబం నుంచి వచ్చి స్వయంకృషితో అసామాన్యంగా ఎదిగిన ప్రజా నాయకుడు లేళ్ళ అప్పిరెడ్డి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (జోన్-3) పోలూరి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు.

శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు లేళ్ళ అప్పిరెడ్డి బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం స్ఫూర్తి ఫౌండేషన్, ఏరువ జగదీశ్వరి కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఇంటర్ విద్యార్థినులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయాలని కోరుతూ 60వేల రూపాయల నగదును జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావుకు అందజేశారు.

ఈ సందర్భంగా పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి నేతగా.. యువజన, కార్మిక నాయకుడిగా.. మిర్చి యార్డు చైర్మన్‌గా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా.. పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడిగా.. శాసనమండలి సభ్యుడిగా.. ప్రభుత్వ విప్‌గా.. రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక బలమైన శక్తిగా ఎంత ఎదిగినా ఎంతో ఒదిగి ఉండే లేళ్ళ అప్పిరెడ్డి నేటి తరం రాజకీయ నాయకులందరికీ ఆదర్శవంతమైన నేత అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుర్రి సాంబిరెడ్డి, లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముందస్తు శుభాకాంక్షలు**

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ఆయనను పలువురు పార్టీ నేతలు, మాజీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో అభిమానులు, లీగల్ సెల్ నేతలు కలిసి పూలదండలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించడం ద్వారా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య నేతృత్వంలో ఇద్దరు దివ్యాంగులకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్వయంగా ఎలక్ట్రికల్ వీల్ ఛైర్లు వితరణగా అందజేశారు.

జన్మదిన వారోత్సవాలలో భాగంగా సోమవారం నగరంపాలెం సెంటర్లో షేక్ ఫాజిల్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

అనంతరం వైసీపీ ట్రేడ్ యూనియన్ గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని మాతృశ్రీ అనాధ బాలుర ఆశ్రమంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు బైరెడ్డి రవీంద్రారెడ్డి, శేషగిరి పవన్, మేకా రవి, మురళి, పోకల వెంకటేశ్వరరావు, సింగు నరసింహారావు, గణేష్, జోసెఫ్, రామిరెడ్డి, పెయింట్ రాజు, నర్సిరెడ్డి, బడుగు నారాయణ, వడ్రాణం సుధాకర్, తోట వెంకటేష్, రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, అనిల్, మాదాసు భాగ్యారావు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కృపాశేఖర్, నీసు రాజు, చెన్నయ్య, రాజు, బద్రి, ఆరిఫ్, జిలానీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఘనంగా గార్మి పండుగ వేడుకలు




○ **చినరావూరులో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

**తెనాలి, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** చినరావూరు 14వ వార్డులో గార్మి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు మక్బుల్, యువత సుభాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరై ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవంతోనే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యమవుతాయని అన్నారు. అన్ని మతాల పండుగలను ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకోవడం మన ప్రాంత ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో చినరావూరులో పండుగ వాతావరణం నెలకొంది.

## ప్రజారోగ్య శాఖ అభివృద్ధికి సహకరిస్తాం



○ **అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలి**

○ **నూతన డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌ను కలిసిన ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి, శాఖ అభివృద్ధికి డైరెక్టర్‌తో కలిసి పనిచేస్తామని ఐఎన్‌టీయూసీ అనుబంధ ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆస్కార్ రావు తెలిపారు. విజయవాడ చుట్టుగుంటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌ను సంఘం ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆస్కార్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు, కార్మిక చట్టాలకు అనుగుణంగా డైరెక్టరేట్ అధికారులు, వివిధ ప్రోగ్రామ్ అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని కోరారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘంగా బాధ్యతాయుతమైన, నిర్మాణాత్మక సహకారం అందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామని, సంఘం విజ్ఞప్తి మేరకు సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు టీడీకే. సాగర్, జిల్లా నాయకులు కొండపల్లి శ్రీనివాసరావు, పి. అపరంజమ్మ, వి.వి. సత్యనారాయణబాబు, విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



○ **కలెక్టర్‌కు ప్రజా సంఘాల వినతి**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ దళిత ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

దళిత క్రైస్తవులకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సంఘాల నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అన్ని దళిత సంఘాలను సమన్వయం చేసుకుని త్వరలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, ఈద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్‌బాబు, క్రైస్తవ నాయకులు మద్దు ప్రేమజ్యోతి బాబు, నల్లపు నీలాంబరం, అనిల్, తిప్పా బత్తుల గోవిందు, దార్ల అర్జున్, విప్పర్ల ముత్తయ్య, వట్టిముక్కల సురేష్, మేడిద సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా పోలీసుశాఖలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వెస్ట్ డీఎస్పీగా బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డీఎస్పీగా టీ. సీతారాం, సౌత్ డీఎస్పీగా జి. పూర్ణచంద్రరావు, ట్రాఫిక్ డీఎస్పీగా ఎస్. కాంతారావు, సీసీఎస్ సీఐగా హైమారావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.

# మంగళగిరి, తాడేపల్లికి తొలగనున్న వరద ముప్పు

○ **నారా లోకేష్ చొరవతో మంగళగిరి, తాడేపల్లి నగరాలకు భారీ వర్షాల ముప్పు నుంచి శాశ్వత రక్షణ**

○ **రూ.68.73 కోట్లతో సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి**

○ **మంగళగిరి డివిజన్‌లో 26, తాడేపల్లి డివిజన్‌లో 11 పనులు.. వెరసి మొత్తం 37 కీలక పనులు**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో భారీ వర్షాల సమయంలో వర్షపు నీరు నిలిచిపోకుండా, వరద ముప్పును తగ్గించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 68.73 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో, మంగళగిరి, తాడేపల్లి నగరాల్లో వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది.

భారీ వర్షాల సమయంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పడే నీటి నిల్వలు, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వర్షపు నీటిని వేగంగా, సమర్థవంతంగా మళ్లించే విధంగా ఈ సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఇందులో కొత్త స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణంతో పాటు, ఇప్పటికే ఉన్న డ్రైన్లను బలోపేతం చేయడం, అవసరమైన చోట్ల వెడల్పు చేయడం, ప్రత్యామ్నాయ డ్రైన్ల ఏర్పాటు వంటి కీలక పనులు చేపట్టనున్నారు.

ఈ సమగ్ర ప్రాజెక్టులో మంగళగిరి డివిజన్ లో రూ. 33.00 కోట్లతో 26 పనులు, తాడేపల్లి డివిజన్ లో రూ. 35.73 కోట్లతో 11 పనులు కలిపి మొత్తం రూ. 68.73 కోట్లతో 37 స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు.

**మంగళగిరి ప్రాంతంలో ప్రధాన ప్రాధాన్యతా ప్రాంతాలు** : మంగళగిరి ప్రాంతంలో రత్నాల చెరువు, NRI ఆసుపత్రి ప్రాంతం, బాపనయ్యనగర్, మార్కండేయ కాలనీ, ఈద్గా వెనుక ప్రాంతం, బాప్టిస్ట్‌పేట, కాజా, చినకాకాని తదితర ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహాన్ని మెరుగుపరిచే డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రణాళిక రూపొందించారు.

నేషనల్ హైవే సర్వీస్ రోడ్ వెంట, వడ్డేశ్వరం, కొలనుకొండ నుంచి ఇప్పటం వరకు వర్షపు నీటిని సక్రమంగా మళ్లించేలా స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**తాడేపల్లి ప్రాంతంలో కీలక డ్రైనేజీ పనులు** : తాడేపల్లి ప్రాంతంలో న్యూ పెట్రోల్ బంక్ తాడేపల్లి సర్వీస్ రోడ్, ఉండవల్లి సెంటర్ నుంచి నులకపేట వరకు, నులకపేట నుంచి డాన్ బాస్కో స్కూల్ వం-కు అవసరమైన స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**డ్రైన్ల నిర్మాణంతో పాటు ఆధునిక వరద నిర్వహణ చర్యలు** : ఈ ప్రాజెక్టు కేవలం డ్రైన్ల నిర్మాణానికే పరిమితం కాకుండా, నగరంలో భవిష్యత్తులో వం-షపు నీటి నిర్వహణకు అవసరమైన సమగ్ర మౌలిక వసతులను అభివృద్ధి చేసే విధంగా రూపొందించడం జరిగింది. అవసరమైన ప్రాంతాల్లో వాటర్ బాడీస్ ను డ్రైనేజీ నెట్ వర్క్ తో అనుసంధానం చేయడం, స్పాంజ్ జోన్లు/డిటెన్షన్ పాండ్ల ఏర్పాటు, బ్లూ గ్రీన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ఇంజెక్షన్ బోర్ల ఏర్పాటు వంటి ఆధునిక చర్యలు చేపట్టనున్నారు. దీంతో పాటు ఇప్పటికే ఉన్న డ్రైన్లను బలోపేతం చేయడం, వెడల్పు చేయడం, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ డ్రైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

**లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై వరద ప్రభావం తగ్గేలా ప్రణాళిక** : ఈ సమగ్ర ప్రణాళిక అమలుతో భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం, రహదారులపై వరద నీరు ప్రవహించడం, ట్రాఫిక్ కు అంతరాయం కలగడం వంటి సమస్యలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రత్నాల చెరువు వంటి వర్షపు నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో, నీటిని ముందుగానే సక్రమమైన మార్గాల్లోకి మళ్లించడం ద్వారా వరద ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

**పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సిద్ధం** : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, భవిష్యత్తులో పెరగనున్న వర్షపు నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. రూ. 68.73 కోట్లతో చేపట్టనున్న 37 కీలక పనులు పూర్తయిన అనంతరం, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వర్షపు నీటి నిర్వహణ వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, భారీ వర్షాల సమయంలో ప్రజలు ఎదుర్కొనే నీటి నిల్వలు, వరదలు, రహదారులపై నీటి ప్రవాహం వంటి సమస్యలకు శాశ్వతమైన, సమగ్ర పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. మంత్రి నారా లోకేష్ గారి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మంగళగిరి, తాడేపల్లి నగర సమగ్ర అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలవనుంది.

# నాటక రంగానికి పూర్వవైభవం : మంత్రి దుర్గేష్

○ **ఏపీలో 'గురజాడ నాటక శిక్షణ'కు రూ. 20 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం..**

○ **నాటక శిబిరాలు ఏర్పాటు**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, నాటక కార్యకలాపాలలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ధ్యేయంగా "గురజాడ నాటక శిక్షణ" పేరిట ప్రత్యేక నాటక శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు(జీవో ఆర్టీ నంబర్ 1933) జారీ చేసినట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ.. అర్హత కలిగిన నాటక సమాజాలు, నాటక పరిషత్తులు, గుర్తింపు పొందిన నాటక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర తగిన భాగస్వామ్య సంస్థల సహకారంతో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఇందుకోసం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 20 లక్షల వ్యయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఈ శిక్షణల ద్వారా బాలల నాటక శిక్షణ, యువజన నాటక శిక్షణ, నాటక రచయితలు, దర్శకుల శిక్షణ, మేకప్ అలాగే సాంకేతిక రంగాలలో నిపుణుల ద్వారా శిక్షణ అందించబడుతుందని, ఫ్యాకల్టీ గౌరవ వేతనాలు మరియు ఇతర ఖర్చుల వివరాలను జీవోలో స్పష్టంగా పొందుపరిచామని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో ఎఫ్‌డీసీ ఎంతో చురుగ్గా పనిచేస్తోందన్నారు. బోర్డు ఏర్పాటైన అనతికాలంలోనే ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన నంది ఫిల్మ్, టీవీ అవార్డులు, నంది నాటకోత్సవాలు, కందుకూరి పురస్కారాలను ప్రకటించామని గుర్తుచేశారు. డిసెంబర్‌లో అమరావతి లేదా విజయవాడ వేదికగా నంది చలనచిత్ర పురస్కారాలు, తిరుపతి వేదికగా నంది టీవీ అవార్డులను అందజేస్తామని, అలాగే జనవరి నెలలో నంది నాటకోత్సవాలు, కందుకూరి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మరోమారు స్పష్టం చేశారు. కళాకారులను అత్యుత్తమ ప్రమాణాలతో నాటకోత్సవాలకు సన్నద్ధం చేసేందుకు ఈ శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

తెలుగు నాటక రంగానికి మహాకవి గురజాడ వెంకట అప్పారావు అందించిన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ, ఆయన 164వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ శిక్షణా కార్యక్రమాలను ఆయన పేరు మీదే నిర్వహించాలని ఎఫ్.డి.సి అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

ఈ శిబిరాల విజయవంతానికి తగిన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతరించిపోతున్న కళలను పరిరక్షించడమే ప్రభుత్వ బాధ్యత అని, సాంకేతికంగా ఎన్ని డిజిటల్ యుగాలు మారినా సజీవ కళల గొప్పతనం ఎప్పటికీ శాశ్వతమే అని మంత్రి దుర్గేష్ తెలిపారు.

## ఢిల్లీ ముఖ్యమంత్రికి దసరా ఉత్సవాల ఆహ్వానం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సోమవారం కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మవారి దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా మహోత్సవాల విశిష్టతను ఢిల్లీ ముఖ్యమంత్రికి వివరించారు. అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు దేశవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే ఈ పవిత్ర వేడుకలకు హాజరై కనకదుర్గమ్మవారిని దర్శించుకోవాలని ఆహ్వానించారు.

## కేంద్ర మంత్రికి 'భారత్ రైజింగ్' పుస్తకం బహుకరణ




**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా ఇన్‌చార్జి, రచయిత కిలారి దిలీప్ రచించిన 'భారత్ రైజింగ్ – ఇన్ ది మోదీ ఎరా' పుస్తకాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు అందజేశారు. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా దిలీప్ పుస్తకాన్ని బహూకరించారు. పుస్తకాన్ని స్వీకరించిన మేఘ్‌వాల్ దిలీప్‌ను అభినందించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్దంలో దేశంలో చోటుచేసుకున్న అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, కీలక మార్పులు, అంతర్జాతీయ వేదికపై భారత్ సాధిస్తున్న ప్రాధాన్యత వంటి అంశాలను పుస్తకంలో వివరించినట్లు దిలీప్ తెలిపారు. భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఇలాంటి రచనలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, మువ్వల వెంకట సుబ్బయ్య, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఎల్‌ఏను కలిసిన విలేజ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యవర్గం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం సోమవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి. జయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సీసీఎల్‌ఏను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ నెల 2న విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో విలేజ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం నూతన కార్యవర్గం సీసీఎల్‌ఏను కలిసి సంఘం తరపున అభినందనలు, శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం. బాపూజీ, సహాధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు జి. అనుపమ, సహాయ కార్యదర్శి వి. కోటేశ్వరరావు, కోశాధికారి వై.పి. రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు మెంటార్లు అండగా నిలబడాలి

○ **ప్రతి ఆరేడుగురు విద్యార్థులకు ఒక మెంటార్ ఉండాల్సిందే**

○ **కళాశాలల ప్రిన్సిపాళ్లకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం స్పష్టీకరణ**

○ **36 వైద్య కళాశాలల్లో 'ఈజ్-ఏపీ' ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడి**

○ **సాయం కోరేలా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి**

○ **మానసిక వైద్య నిపుణురాలు అపర్ణ వుప్పల**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఎంబిబియస్ వైద్య విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం కళాశాలల్లో మెంటార్-మెంటీ వ్యవస్థను బలోపేతం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సుధీర్ కోరారు. వైద్య విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో తీసుకోవాల్సిన మరిన్ని ముందస్తు జాగ్రత్తలపై కళాశాలల ప్రిన్సిపాళ్లతో సోమవారం వెబినార్‌ను వీరు నిర్వహించారు. ప్రముఖ మానసిక వైద్య నిపురాణులు అపర్ణ వుప్పల(అమెరికా) వైద్య విద్యార్థుల మానసిక పరిస్థితి, కళాశాలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వెబినార్ ద్వారా ప్రిన్సిపాళ్లకు వివరించారు. వెబినార్ ముగిసిన అనంతరం వీరు ముగ్గురు విశ్వవిద్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్య కళాశాలల్లో ఉండే బోధకుల సంఖ్యకు తగ్గట్టు ఒక్కొక్కరు ఆరు నుంచి ఏడుగురు విద్యార్థులకు మెంటార్-మెంటీగా వ్యవహరించాలని, ఈ వ్యవస్థ పటిష్టంగా ఉంటే సత్ఫలితాలు బాగా ఉంటాయని చెప్పారు. కొత్తగా చేరే ప్రతి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబియస్ విద్యార్థుల సంక్షేమం నిమిత్తం ప్రిన్సిపాళ్ల నేతృత్వంలో కమిటీ ( మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్)ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించిందని గుర్తు చేశారు.' వైద్య విద్యలోని ఒత్తిడి, అందుబాటులో ఉన్న సహాయక చర్యలు శారీరక, మానసికి ఆరోగ్యంపై అవగాహన కలిగించాలి. ప్రతి ఏడాది ఒకసారి తల్లిండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలి. విద్యార్థుల్లో కనిపించే మానసిక సమస్యల హెచ్చరిక సంకేతాలపై అవగాహన కలిగించాలి. ఒంటరిగా ఉండడం, గైర్హాజరు పెరగడం, చదువులో అకస్మాత్తుగా వెనుకబడడం, దురాలవాట్లు, పరీక్షల్లో ఫెయిల్ అవడం వంటి హెచ్చరిక సంకేతాలు గమనించిన వెంటనే సదరు విద్యార్థుల విషయంలో మెంటార్ గా ఉన్నవారు అప్రమత్తంగా వ్యవహరించాలి' అని సూచించారు.

**'ఈజ్-ఏపీ' శిక్షణ ద్వారా సత్ఫలితాలు**

'2023 జనవరి 6న 'ఈజ్-ఏపీ' ( EASE - Emotional Assessment of Students by Educators ) కార్యక్రమం ప్రారంభమైంది. క్యూపీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా, సూసైడ్ ప్రివెన్షన్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం అమలవుతుంది. ఆరోగ్యశాఖ, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం, వైద్య విద్యాశాఖ తదితర విభాగాలు భాగస్వాములుగా ఉన్నాయి. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం, అవసరమైనప్పుడు సహాయం కోరేలా ప్రోత్సహించడం, తోటి విద్యార్థులకు అండగా నిలిచే నైపుణ్యాలను పెంచడం, మానసిక సమస్యలపై ఉన్న అపోహలు, సంకోచాన్ని తగ్గించడం దీని లక్ష్యాలు. 2025 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు 17 ప్రభుత్వ, 19 ప్రైవేట్ వైద్య కళాశాలల్లో శిక్షణ ఇచ్చారు. 19 ప్రైవేట్ కళాశాలల్లో 3,645 మంది విద్యార్థులు నమోదు కాగా, 3,633 మంది పీర్ మెంటార్ శిక్షణకు హాజరయ్యారు. 99 శాతం హాజరు నమోదైంది. క్యూపీఆర్ శిక్షణకు 3,645 మంది నమోదు కాగా, 3,059 మంది శిక్షణ పూర్తిచేశారు. 4 నుంచి 6 గంటల శిక్షణలో ఒత్తిడి, మానసిక ఇబ్బందుల సంకేతాలను గుర్తించడం, సమయ నిర్వహణ, శ్రద్ధగా వినడం, సానుభూతితో స్పందించడం, అవసరమైనప్పుడు నిపుణుల వద్దకు పంపించడం వంటి అంశాలను నేర్పిస్తున్నారు. క్యూపీఆర్ అంటే 'అడగండి.. ప్రోత్సహించండి.. నిపుణుల వద్దకు పంపండి'. 60-90 నిమిషాల ఆన్‌లైన్ శిక్షణ పూర్తిచేసిన వారికి క్యూపీఆర్ గేట్‌కీపర్ ధ్రువీకరణ పత్రం అందిస్తారు' వీసీ, రిజిస్ట్రార్ వివరించారు.

**సాయాన్ని కోరడం బలహీనత కాదు-అపర్ణ వుప్పల**

ఈజ్-ఏపీ మెడికల్ డైరెక్టర్, బాలల-కౌమార మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ అపర్ణ వుప్పల మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడి, భావోద్వేగ ఇబ్బందులను ముందుగానే గుర్తించాలని సూచించారు. తోటి విద్యార్థిలో ఇబ్బందుల సంకేతాలు కనిపిస్తే విమర్శించకుండా మాట్లాడాలని, అతను చెప్పేది శ్రద్ధగా వినాలని తెలిపారు. అవసరమైనప్పుడు నిపుణుల సహాయం అందేలా చూడాలని సూచించారు. మానసిక సమస్యకు సహాయం కోరడం బలహీనత కాదని, విద్యార్థులు మానసిక వైద్యులను సంప్రదించేందుకు సంకోచించకూడదని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు సహాయం కోరేలా ప్రోత్సహించాలని సూచించారు.

**ఆత్మహత్య వార్తల కవరేజ్‌లో సంయమనం అవసరం**

ఆత్మహత్యలకు సంబంధించిన వార్తలను ప్రచురించేటప్పుడు మీడియా బాధ్యతగా వ్యవహరించాలని ఈజ్-ఏపీ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఆత్మహత్య పద్ధతి, ఘటన జరిగిన ప్రదేశం, వ్యక్తిగత లేఖలు, సందేశాలు, చాట్ లు, సామాజిక మాధ్యమాల పోస్టులను ప్రచురించకూడదు. సంచలనాత్మక శీర్షికలను నివారించాలని మానసిక వైద్య నిపుణురాలు అపర్ణ పేర్కొన్నారు. పరీక్షలు, ర్యాగింగ్, కుటుంబ సమస్యలు వంటి ఏ ఒక్క అంశాన్నీ ఆత్మహత్యకు ఏకైక కారణంగా పేర్కొనకూడదని తెలిపారు

విలేకరుల సమావేశంలో రీసెర్చ్ విభాగం డైరెక్టర్ సూర్యప్రభ పాల్గొన్నారు. వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు వెబినార్ లో పలువురు పీజీ వైద్య విద్యార్థులకు కూడా మానసిక ఒత్తిళ్లు అధిగమించడంపై ప్రత్యేకంగా తరగతుల్ని నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. దీనిపై సానుకూలత వ్యక్తమైంది. ఇప్పటికే ఎన్ఎంసి జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాల్సిన అవసరం ఉందని వెబినార్ లో విశ్వవిద్యాలయం స్పష్టతనిచ్చింది. మానసిక ఆరోగ్య పై పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉందని కూడా విసి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P.).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com